క్లుప్తంగా

16న వక్ఫ్ బోర్డు భూముల కాస్తుకు వేలం

బల్మూర్: మండలంలోని గోదల్ శివారులోని సర్వే నంబర్లు 120, 121లో వక్ఫ్ బోర్డు భూమి 369 ఎకరాలకు సంబంధించి ఒక సంవత్సరం కాస్తు చేసుకునేందుకు ఈ నెల 16న స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిష్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలంలో పాల్గొనే వారు 18 సంవత్సరాలు నిండిన వారై ఉండి, రూ.5వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలంలో ఎక్కువగా పాడిన వారిపై ఒక సంవత్సరం కాస్తు చేసుకునేందుకు అనుమతి పత్రం ఇస్తామని చెప్పారు. వేలం డబ్బులను అదే రోజు చెల్లించాలని, వేలం పూర్తయ్యే వరకు ఈ భూమిలో ఎవరూ సేద్యం చేయరాదని తహసీల్దార్ తెలియజేశారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు, ఎరువులు

ఉప్పునుంతల: స్థానిక పీఏసీఎస్‌లో వరి విత్తనాలు, ఎరువుల బస్తాలు అందుబాటులో ఉంచామని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1010 రకం వరి విత్తనాలు 50 బస్తాలు(బస్తా ఒకటి రూ.890లకు), బీపీటీ రకం వరి విత్తనం 50 బస్తాలు(బస్తా ఒకటి రూ.1,083లకు), జీలుగ విత్తనాలు సబ్సిడీపై 25 కిలోల బస్తా రూ.873లకు అందజేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా డీఏపీ 1000 బస్తాలు(బస్తా ఒకటి రూ.1,350లకు), యూరియా 900ల బస్తాలు(బస్తా ఒకటి రూ.267లకు), 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువులు 800 బస్తాలు (బస్తా ఒకటి రూ.1200లకు) అందుబాటులో ఉన్నాయని వివరించారు.

రేషన్‌కార్డు లేనివారికి అవకాశం కల్పించాలి




నాగర్‌కర్నూల్ రూరల్: రేషన్‌కార్డు లేని రజక వృత్తిదారులకు వృత్తిదారుల రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి కొ(్ట)ట్ర నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతి అందజేశారు. రజక ఉచిత లబ్ధిదారులందరికీ రుణాలు తీసుకునేందుకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, దరఖాస్తు చేసుకునే ప్రతి రజకుడికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం ధ్రువపత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయిబాబు, ఆంజనేయులు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని జినుకుంట శివార్‌లోని సర్వే నంబర్ 53లో కదారి వెంకటమ్మకు చెందిన పొలంలో సాగు చేసిన పత్తి మొలకలను ధ్వంసం చేసిన సంఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పది రోజుల కిందట కదారి వెంకటమ్మ తన పొలంలో పత్తి విత్తనాలు నాటగా అవి మొలకొచ్చాయి. ఈ మొలకలను పక్క గ్రామమైన రాకొండకు చెందిన తిరుపతమ్మ, వట్టిపల్లికి చెందిన ఈదమ్మ పొలంలోకి ప్రవేశించి పీకివేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి



కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ నుంచి ఎల్లికట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డు 3 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుంది. ఎల్లికట్ట, వెంకటాపూర్, తర్నికల్ గ్రామాల పరిధిలోని రైతులకు, ప్రజలకు ఈ రోడ్డు సౌకర్యంగా ఉంటుంది. ప్రధానమైన రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని ఎన్నికల హామీలకే నాయకులు పరిమితం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2018 ఎన్నికల సందర్భంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చి మరిచిపోయారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ అన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరచాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే గ్రామస్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అనిల్‌గౌడ్ అన్నారు.

ఎంపీఓకు వినతి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు పెంట్లవెల్లి పంచాయతీ కార్యదర్శి సాధిక్‌పాషాను వెంటనే సస్పెండ్ చేయాలని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ భరత్‌కు పెంట్లవెల్లి కార్మికులు, సీఐటీయూ జిల్లా నాయకులు ఈశ్వర్ ఆధ్వర్యంలో వినతి అందజేశారు.

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి



తుమ్మలసూగూరు పాఠశాలలో విద్యార్థులను చేర్పించిన ఉపాధ్యాయులు

కోడేరు: ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల కార్మికులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తీగలపల్లిలో బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని ర్యాలీ నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ విజయ, జయలక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లిలో ర్యాలీ..

తెలకపల్లి: బడిఈడు ఉన్న పిల్లలందరూ బడిలోనే ఉండాలని కోనేరు చైల్డ్ రైట్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ టీసీఓ రోజాలీల అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోనేరు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు మండల పురవీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ చదవాలని, చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, గోవర్ధన్‌రావు, లక్ష్మణ్, ఆనంద్, వేదావతి, సుజాత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

తాడూరు: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల గదులతో పాటు పాఠశాలను శుభ్రం చేయడంతో పాటు ఇంటింటా తిరిగి చిన్నారులను బడిలో చేర్పించారు. బడిబయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించేలా ప్రత్యేక బడిబాట కార్యక్రమం రెండు రోజుల పాటు ఉంటుందని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని తుమ్మలసూగూరులో సర్వేలో గుర్తించిన అయిదుగురు విద్యార్థులను సోమవారం పాఠశాలలో వారి పేర్లను నమోదు చేశారు.



కోడేరు తహసీల్దార్ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు



తెలకపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కోనేరు సంస్థ నిర్వాహకులు

చారకొండలో..

చారకొండ: బడిఈడు పిల్లలు బడిలో చేరాలని హెచ్‌ఎం మహిపాల్ నాయక్ అన్నారు. మండలంలోని తుర్కలపల్లిలో సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులతో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

తెలకపల్లి: మండల పరిధిలోని పెద్దపల్లికి చెందిన తిరుపతయ్య అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.లక్ష చెక్కును సోమవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధితుడు తిరుపతయ్యకు అందజేశారు. బంగారయ్య, జయరాం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను సర్పంచ్ కర్రెమ్మ పంపిణీ చేశారు. వెంకటమ్మకు రూ.24 వేలు, షేక్ గురీబీకి రూ.23 వేలు, నర్సమ్మకు రూ.20 వేలు చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. రాజవర్ధన్‌రెడ్డి, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కు..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో జటప్రోల్‌కి చెందిన ముబీనాకు కల్యాణ లక్ష్మి చెక్కును పెంట్లవెల్లి మండల వైస్ ఎంపీపీ భీంరెడ్డి చేతుల మీదుగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి రూరల్: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సీఎం కేసీఆర్‌ను సోమవారం ప్రగతిభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డి-82లో భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.8 కోట్లు విడుదల చేయాలని సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విలేకరులకు తెలియజేశారు. వివిధ కారణాలతో చాలా రోజులుగా నిలిచిపోయిన పెండింగ్, నష్టపరిహారాన్ని వెంటనే రైతుల కోసం విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విజ్ఞప్తి మేరకు స్పందించిన సీఎం ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావుకు నిధులు మంజూరు చేయాలని ఆదేశాలు ఇచ్చారని, త్వరలోనే రైతులకు నిధులు అందుతాయని ఎమ్మెల్యే వివరించారు.

పరిహారం అందించాలని వినతి

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌కి చెందిన భూ నిర్వాసితులకు పరిహారం అందించాలని కోరుతూ ఎమ్మెల్సీకి సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిండి- నార్లాపూర్ ప్రాజెక్టులో భాగంగా అజిలాపూర్‌కి చెందిన రైతులు పొలాలు కోల్పోయినట్లు వివరించారు. దాదాపుగా ఐదుఏళ్లు గడుస్తున్నా.. నేటికి పరిహారం అందలేదన్నారు. గ్రామానికి చెందిన 50 మంది రైతులు కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయినట్లు చెప్పారు. పనులు నిలిచిపోవడంతో రైతులకు నేటికి పరిహారం అందలేదని వివరించారు. కార్యక్రమంలో రైతులు సర్దార్, జంగాచారి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

వెల్దండ పరిధిలో..

మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. చెదురుపల్లికి చెందిన ఆర్.ముత్యాలికి రూ.16 వేలు, అనిల్‌కు రూ.31 వేలు, కంటోనిపల్లి చెందిన శ్రీరాములుకు రూ.47 వేలు, శ్రీనుకు రూ.16 వేల చెక్కులను ఎమ్మెల్సీ అందజేశారు. రామకృష్ణ, శ్రీనునాయక్, జంగయ్య, సురేందర్‌రెడ్డి ఉన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

తెలకపల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో భక్తిభావంతో మెలగాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆచార సంప్రదాయాలు, మరువొద్దని భక్తిభావంతో మెలగాలని, అప్పుడే శాంతియుత జీవనం సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో స్నేహబంధాలు ఏర్పడి గ్రామాభివృద్ధికి తోడ్పడుతాయన్నారు. అనంతరం నిర్వహించిన బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. బైకాని శ్రీనివాస్ యాదవ్, కొమ్ము మధు, హనుమంతురావు, విష్ణు, మామిళ్లపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

వెల్దండ: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ శాలువాతో సన్మానించారు. జిల్లా కేంద్రం బదిలీపై వెల్దండ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల లక్ష్యసాధనకు కృషి



9.8 సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

నాగర్‌కర్నూల్ రూరల్: విద్యార్థుల లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని తూడుకుర్తి ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థిని గాయత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపినట్లే బాసర ఐఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో బాగా రాణించాలన్నారు. పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. డీఈఓ గోవిందరాజులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, రమేశ్, ప్రకాశ్‌బాబు, రాజు, మురళీధర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

కందనూలు: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందానికి స్వాగతం పలుకుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ గురుప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడిని నెరవేర్చడానికి ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు.

గోకారం చెరువు పునరుద్ధరణకు కృషి

చారకొండ: మండలంలోని గోకారం చెరువును పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు ఈఈ యాదన్ కుమార్, జ్ఞానేశ్వర్, ఏఈలతో కలిసి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చెరువు నీటి నిల్వ కోసం కట్టను ఏర్పాటు చేయలని కోరారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి కట్ట ఏర్పాటుకు కృషి చెస్తామని అన్నారు. వారి వెంట వెల్దండ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సంజీవ్ యాదవ్, జంగయ్య యాదవ్, రాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

శాకాహారంపై ర్యాలీ

ఊర్కొండ: మానవులకు శాకాహారమే శ్రేష్టమైందని, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకుమారి రవీందర్ అన్నారు. సోమవారం రేవల్లిలో పిరమిడ్ ఆధ్వర్యంలో పద్మ జంగయ్య దంపతులు శాకాహారంపై ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ రెడ్డి, సునీత, నరసింహ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రవ్వ సందడి

కందనూలు: తీన్మార్ వార్తల ఫేమ్ చంద్రవ్వ(సుజాత) సోమవారం జిల్లా కేంద్రంలో సందడి చేసింది. సాయి హరి అకాడమీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై సందడి చేసింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఆమెతో సెల్ఫీలు తీసుకోవడానికి పోటీపడ్డారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పదరలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీలు

అమ్రాబాద్: మండల కేంద్రం పదరలో సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీటీసీలు ఎల్లమ్మ, సునీత ప్రారంభించారు. రూ.ఐదు లక్షలతో రామాలయం కాలనీలో ఈ రోడ్డు పనులను కొబ్బెరకాయలు కొట్టి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకులు జగపతియాదవ్, గోలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



మారేడుమాన్‌దిన్నెలో ఊటకుంట పనులు చేస్తున్న కూలీలు

పెద్దకొత్తపల్లి: మండలంలో పలు గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేసవిలో కూలీలు ఈ పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో సోమవారం 1517 కూలీలు ఉపాధి పనులకు వెళ్లినట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. ఉపాధి పనులు చెరువు కట్టలపై ముళ్ల తొలగింపు, పాటుకాల్వల్లో మట్టి తొలగింపు, ఊట కుంటల నిర్మాణాలు తదితర పనులు కొనసాగుతున్నాయి. కొత్తగా జాబ్‌కార్డులు కావాల్సిన వారు గ్రామపంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య సూచించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



బాలకార్మిక నిర్మూలనపై మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు

తెలకపల్లి: బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డంపల్లిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని దీనికి కారకులైన తల్లిదండ్రులపై చర్య తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని అన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా మార్కులు ఎక్కువ సాధించాలని భయపెట్టవద్దని, చిన్న పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారిని ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేశ్‌బాబుతో పాటు సబిత, ఎంపీపీ కొమ్ము మధు, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణకుమార్, సర్పంచ్ లక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, శ్యాంప్రసాదరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 2 కే రన్



కార్యక్రమంలో అధికారులు, పోలీసులు



అచ్చంపేటలో 2 కె రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ

కొల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కొల్లాపూర్‌లో 2 కే రన్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పరుగు పోటీ ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలల పీఈటీలతో పాటు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది 2 కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హనుమనాయక్ మాట్లాడారు. ప్రజలను ఆరోగ్యంగా ఉంచేందుకు, వారిని చైతన్యపర్చేందుకు 2కే రన్ చేపట్టినట్లు వివరించారు. ఎస్‌ఐ రాజు, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిరూపతో పాటు పలువురు పాల్గొన్నారు.

అచ్చంపేటలో 2కె రన్

అచ్చంపేట రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అచ్చంపేటలో 2 కె రన్ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

తాడూరు: హరితహార కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని లచ్చిరాంతండా, ఇంద్రకల్‌లోని ప్రకృతి వనాల నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని తెలియజేశారు. ఆయన వెంట లక్ష్మణ్ నాయక్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



లచ్చిరాం తండాలో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చెంచులకు కూరగాయల విత్తనాలు పంపిణీ

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంత చెంచులకు వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం సొంత పనులకు గానూ మన్ననూర్‌కు వచ్చిన మల్లాపూర్ చెంచుపెంటకు చెందిన పలువురు చెంచు మహిళలకు వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందజేశారు. కల్యాణ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సంభు శోభ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి



వినతి అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సమ్మె నోటీసును డీపీఓ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 21 తరువాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని, అంతలోపే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారనే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అశోక్, మహేష్, మల్లేష్, కుర్మయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం



అచ్చంపేటలో నిరసన చేపడుతున్న బీజేపీ నాయకులు

అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని బీజేపీ నాయకుడు సతీష్‌మాదిగ ఆరోపించారు. సోమవారం అచ్చంపేటలో బీజేపీ ఆధ్వర్యంలో రివర్స్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా వివిధ శాఖల ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సారి బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ, మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. సోమవారం అచ్చంపేటలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికి కార్యకర్తలు తిరిగి ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే వరకు కార్యకర్తలు అహర్నిషలు కృషి చేయాలని కోరారు. మాధవి, నరేందర్‌రావు, నాగరాజు, మంగ్యానాయక్, జానకి, రేణయ్య, చందులాల్ పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

వెల్దండ: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణికి అధికారులు గైర్హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు ఉన్నా.. అధికారులు గైర్హాజరయ్యారని అన్నారు. ముఖ్యమైన శాఖల అధికారులు ప్రజావాణికి హాజరుకాకపోవడంతో ఫిర్యాదులు ఇవ్వకుండా ప్రజలు వెనుదిరిగి వెళ్లారు.

సమస్యలు సత్వరమే పరిష్కారం

చారకొండ: ప్రజావాణికి అందిన ఫిర్యాదులను ఆయా శాఖల ద్వార సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. భూ సమస్యలపై మూడు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

బల్మూర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల నుంచి స్పందన కరువైంది. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా.. కొందరు మాత్రమే హాజరవుతుండటంతో తమ సమస్యలు ఎవరికి చెప్పినా ప్రయోజనం లేదనే దోరణి ప్రజల్లో ఏర్పడింది. దీంతో ఈ కార్యక్రమం తూతూమంత్రంగా సాగుతుందని విమర్శలు వస్తున్నాయి. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా.. కేవలం విద్య, ఆరోగ్యం, ఐసీడీఎస్ శాఖల వారు మాత్రమే హాజరు కాగా.. మిగతా శాఖల వారు గైర్హాజరయ్యారు.



చారకొండలో ప్రజావాణి